క్లుప్తంగా

గాలీవానతో తెగిన విద్యుత్ తీగలు



దొరవారిసత్రం : మండలంలో శుక్రవారం రాత్రి గాలీవానతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. దీంతో పలు ప్రాంతాల్లో చెట్లు విరిగి విద్యుత్ తీగలపై పడ్డాయి. కుప్పారెడ్డిపాళెం సమీపంలో అక్కరపాక ఫీడర్‌కు చెందిన విద్యుత్ తీగలు తెగిపోయాయి. దీంతో శనివారం మధ్యాహ్నం వరకు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. స్థానిక ఏఈ జగదీష్ తమ సిబ్బందితో కలిసి సహాయక చర్యలు చేపట్టారు.

శ్రీధనమల్లిలో వైద్య శిబిరం



శ్రీధనమల్లి వైద్య శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు

దొరవారిసత్రం : మండలంలోని తొగరాముడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని శ్రీధనమల్లిలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అదే విధంగా వీధులు, తాగునీటి కొళాయిలు వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లారు. తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేశారు. ఇళ్ల మధ్యలో ఉన్న పేడ దిబ్బలను తొలగించాలని సచివాలయం సిబ్బందికి సూచించారు.

ట్రిపుల్ ఐటీకి గురుకుల విద్యార్థుల ఎంపిక



పి.ఈశ్వర్, కె.అవినాష్, ఎ.సాయికుమార్

చిల్లకూరు : స్థానిక బాలుర గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు పి.ఈశ్వర్ (575), కె.అవినాష్(573), ఎ.సాయికుమార్(565) ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మీరా సాహెబ్ తెలిపారు. వారిలో సాయికుమార్ తెలంగాణలోని బాసర ట్రిపుల్ ఐటీకి, మిగిలిన ఇద్దరు వైఎస్సార్ కడప జిల్లాలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు తెలిపారు. వారిని ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు కండలేరుకు మంత్రుల రాక

రాపూరు : మండలంలోని కండలేరు జలాశయాన్ని పరిశీలించి అభివృద్ధి పనులపై చర్చించేందుకు ఆదివారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ రానున్నట్లు అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 1.30 గంటలకు సోమశిల జలాశయాన్ని సందర్శిస్తారని పేర్కొన్నారు. అనంతరం కండలేరు జలాశయం అతిథి గృహానికి చేరుకుని 2.30 గంటలకు జలవనరుల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.

కండలేరులో 6.303 టీఎంసీల నీరు

కండలేరు జలాశయంలో శనివారం నాటికి 6.303 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరద కాలువ నుంచి కండలేరు జలాశయానికి 100 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. అలాగే హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 5 క్యూసెక్కులు, లోలెవల్ కాలువకు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

శివయ్య సేవలో వేద విద్యార్థులు

శ్రీకాళహస్తి: వేద విద్యార్థులు శనివారం శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. జనార్ధనంద సరస్వతి వేదవిద్వాన్ మహాసభలు ఆలయ సమీపంలోని భరద్వాజ తీర్థం గంగాసదన్‌లో జరుగుతున్నాయి. ఆదివారంతో ఈ సభలు ముగియనున్నాయి. శనివారం ఆ సంస్థ చైర్మన్ బ్రహ్మశ్రీ సాయినాథ్‌శర్మ, పశుపతి బ్రహ్మానంద శర్మ ఆధ్వర్యంలో వేదవిద్యార్థులు శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని, జ్ఞానాంబను దర్శించుకున్నారు. వేదపారాయణం చేస్తూ ఆలయం మొత్తం తిరిగారు. అనంతరం వారు మాట్లాడుతూ వేదపరిరక్షణకు వేదంలోని సారాన్ని ప్రజలకు తెలియజేయడానికి 15ఏళ్లుగా వేదమహాసభలు నిర్వహిస్తున్నామని, ప్రతి సంవత్సరం ఒక క్షేత్రంలో ఈ వేదవిజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ సభను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభల్లో వేద విద్యను అభ్యసించే విద్యార్థులకు చేయూత ఇస్తామన్నారు. వారిలో ప్రతిభ గుర్తించి రాతపరీక్ష ద్వారా ధ్రువపత్రాలు అందజేస్తున్నామన్నారు. ఈ విద్యార్థులకు ఆలయాల్లో అవకాశాలు ఉంటాయన్నారు.

ఘనంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఉన్న శనీశ్వరస్వామికి శనివారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని, స్వామివారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా గంగ పనులు

సూళ్లూరుపేట నియోజకవర్గంలోని రైతులకు సాగునీటితోపాటు ప్రజలకు తాగునీరు అందించేందుకు సంకల్పించిన తెలుగు గంగ కాలువ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. పదేళ్లుగా పనుల గురించి అధికారులు పట్టించుకోవడం లేదు. భూమి కోల్పోయిన రైతులకు మూడేళ్ల క్రితం పరిహారం చెల్లించినా పనులు మాత్రం ముందుకు సాగలేదు. దీంతో కాలువలు పూడిపోతున్నాయి. కాంక్రీట్ నిర్మాణాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

– దొరవారిసత్రం



నెలబల్లి గ్రామ పరిధిలోని పంట పొలాల మధ్య అసంపూర్తిగా ఉన్న 14ఆర్ మేజర్ కాలువ

- 14 ఆర్ మేజర్ కాలువ పూర్తయితే వేల ఎకరాలకు నీరు
- నెలబల్లి వద్ద ఆగిపోయిన పనులు
- పట్టించుకోని అధికారులు

దొరవారిసత్రం, సూళ్లూరుపేట మండలాల్లో 22 కిలోమీటర్ల మేర తెలుగు గంగ 14 ఆర్ మేజర్ కాలువ నిర్మాణాన్ని పదేళ్ల క్రితం చేపట్టారు. దీని ద్వారా 5 వేల ఎకరాలకు పైగా సాగునీరు అందుతుంది. మెట్ట రైతుల సాగు నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ఈ కాలువ నిర్మాణానికి శ్రీకారం చుట్టి పుష్కరకాలం దాటినా పనులు పూర్తికాకపోవడంతో గంగ నీటి కల కలగానే మిగిలింది. 14ఆర్ మేజర్ కాలువ నెలబల్లి గ్రామ సమీపంలో తెలుగు గంగ 7వ బ్రాంచ్ కాలువ నుంచి మొదలై నెలబల్లి గ్రామ పరిధిలోని పంట పొలాల మీదుగా నెల్లూరుపల్లి, మైలాంగం, నేలపట్టు, ఆనేపూడి, కల్లూరుకండ్రిగ, శ్రీధనమల్లి గ్రామాల మీదుగా సూళ్లూరుపేట మండలం ఆబాకు గ్రామంలోని చెరువు వరకు విస్తరించి ఉంది. అన్ని ప్రాంతాల్లో పనులు పూర్తయ్యాయి. నెలబల్లి గ్రామంలో మాత్రమే పనులు ఆగిపోయాయి. కాలువకు భూమి కోల్పోయిన 60 మంది రైతులకు నష్ట పరిహారం చెల్లింపు విషయంలో అధికారుల ఆలస్యం చేయడం, సూళ్లూరుపేట–దొరవారిసత్రం మండలాల సరిహద్దులో ఉన్న అటవీ ప్రాంతంలో కాలువ నిర్మాణానికి ఫారెస్టు అధికారుల నుంచి అనుమతులు రాకపోవడంతో పనులు ఆగిపోయాయని ప్రజా ప్రతినిధులు, ప్రజలు చెబుతున్నారు.

పూడిపోతున్న కాలువలు

14ఆర్ మేజర్ కాలువపై రైతులు, స్థానికులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కాలువ పనులు పూర్తయి చెరువులకు నీరు వదిలితే పంటలు పండించుకోవచ్చని చెబుతున్నారు. పనులు పూర్తి చేయడంపై అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. పనులు పూర్తి కాకపోవడంతో కాలువ నుంచి గ్రామాల్లోని ఇరిగేషన్ చెరువులకు గంగ నీటిని తీసుకువెళ్లేందుకు నిర్మించిన సప్లయి చానల్స్ పూడిపోతున్నాయి. వీటిపై నిర్మించిన కాంక్రీట్ నిర్మాణాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. కొన్నిచోట్ల చెట్లు పెరిగి కాలువ కనిపించడం లేదని, అదే విధంగా మేజర్ కాలువ నిర్మించి డ్రాప్‌లు, యూటీలు వంటి నిర్మాణాలు కూడా పగుళ్లు ఇచ్చాయని పేర్కొంటున్నారు. ఇప్పటికే మైలాంగం, ఆనేపూడి, పోలిరెడ్డిపాళెం, సూరపుఅగ్రహారం, నెల్లూరుపల్లి, పడమటికండ్రిగ తదితర ప్రాంతాల్లో సప్లయి చానల్స్ పూడిపోవడంతో పాటు చెట్లతో కాలువ నిండిపోయింది.

పరిహారం చెల్లించినా సాగని పనులు

14 ఆర్ కాలువకు నెలబల్లి గ్రామం పరిధిలో 60 రైతులు భూమి ఇచ్చారు. వారికి ఐదేళ్ల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించలేదు. దీంతో రైతులు పనులను అడ్డుకున్నారు. మూడేళ్ల క్రితం పరిహారం సమస్య జిల్లా స్థాయి అధికారుల వద్దకు చేరింది. దీంతో తెలుగు గంగ అధికారులు అందరికీ నష్ట పరిహారం అందేలా చర్యలు చేపట్టారు. కానీ పనులు మాత్రం ముందుకు సాగలేదు. దానికి తోడు వివిధ ప్రాంతాల్లో కాంక్రీట్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతూనే ఉన్నాయి. పనులను త్వరితగతిన పూర్తి చేసి సాగు నీరు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

కొత్త ప్రతిపాదనలు పంపుతున్నాం



దొరవారిసత్రం, సూళ్లూరుపేట మండలాల్లో చేపట్టిన 14ఆర్ మేజర్ గంగ కాలువ పనులు, ఈ కాలువ నుంచి చెరువుల్లోకి వెళ్లే సప్లయి చానల్ పనులు పూర్తి చేసేందుకు కొత్తగా ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపుతున్నాం. గతంలోనే గంగ ప్యాకేజీ పనులు క్లోజ్ చేశాం. ప్రస్తుతం తక్కువ ఖర్చుతో రైతులు అధిక ఫలితాలు పొందేలా పనులు ఎక్కడ అవసరమో అక్కడ పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నాం.

– రాధాకృష్ణమూర్తి, ఈఈ, తెలుగు గంగ శాఖ, వెంకటగిరి డివిజన్



ఆనేపూడి- కల్లూరు గ్రామాల మధ్య చెట్లతో నిండిపోయిన సప్లయి చానల్



దొరవారిసత్రం వద్ద పిచ్చి మొక్కలతో నిండిపోయిన సప్లయి చానల్

వైభవంగా నృసింహుని కల్యాణం





స్వామి, అమ్మవార్ల కల్యాణం చేస్తున్న అర్చకులు, కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

రాపూరు: మండలంలోని పెంచలకోన క్షేత్రంలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీ దేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కై ంకర్యాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తదుపరి పూలంగి సేవ చేపట్టారు. 10 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్యకల్యాణ మండపంలో కొలువుదీర్చి విశేషంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్ఛరనణ మధ్య కల్యాణాన్ని అత్యంత వైభవంగా జరిపించారు. సాయంత్రం 6 గంటలకు స్వామి, అమ్మవార్లు తిరుచ్చిని అధిరోహించి ఊరేగించారు. తర్వాత సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శ్రీవారిని దర్శించుకున్నారు.

దేవదాయశాఖ అధికారికి సన్మానం



దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌ను సన్మానిస్తున్న విజయశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి

నాయుడుపేట టౌన్ : గూడూరు డివిజన్‌లో దేవదాయ శాఖ ఈవోగా పనిచేస్తూ అసిస్టెంట్ కమిషనర్ పదోన్నతి పొందిన జనార్ధన్ రెడ్డిని శనివారం విన్నమాలలోని శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయం వద్ద ట్రస్టీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆయన ఇక్కడ ఈవోగా పనిచేసిన సమయంలో ఆలయాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు. జనార్ధన్ రెడ్డి ఏసీగా పదోన్నతి పొంది ప్రకాశం జిల్లాకు బదిలీ కావడం అభినందనీయమన్నారు. ట్రస్టీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు వేణుంబాక విజయశేఖర్ రెడ్డి, విన్నమాల గ్రామ పెదకాపు ఆరవభూమి శ్రీనివాసులు రెడ్డి, గూడూరు డివిజన్ దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ గదుల వేలం పాట వాయిదా

విన్నమాల గ్రామంలోని శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయానికి సంబంధించి నాయుడుపేటలో ఉన్న గదుల వేలం పాటలను వాయిదా వేసినట్లు దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ జనార్ధన్ రెడ్డి తెలిపారు. విన్నమాల గ్రామంలోని ఆలయం వద్ద శనివారం పట్టణంలోని రాఘవేంద్ర దుకాణాల సముదాయం వెనుక ఉన్న సుమారు 60 సెంట్ల ఖాళీ స్థలానికి వేలం పాటలు నిర్వహించారు. దీనికి మహేష్ రెడ్డి అనే వ్యక్తి రూ.లక్షకు పైగా పాడారు. గతంలో అదే ఖాళీ స్థలానికి రూ.2 లక్షలకు పైగా వేలం పాట పెట్టారు. దీంతో వాయిదా వేశారు. స్థానికులు మాట్లాడుతూ గతంలో ఖాళీ స్థలానికి అధిక మొత్తంలో వేలం పాటలు పడినప్పటికీ నగదు చెల్లించలేదన్నారు. ఈ క్రమంలో అధికారులు పరిశీలన చేసి ప్రస్తుతం వేలం పాట పాడిన వ్యక్తికి అప్పగించి ఆలయ అభివృద్ధికి సహకరించాలని అసిస్టెంట్ కమిషనర్‌ను కోరారు. అందుకు ఆయన అంగీకరించలేదు. మళ్లీ వేలం పాటలు నిర్వహించి ఎవరు ఎక్కువ ధరకు పాడతారో వారికి స్థలాన్ని అప్పగిస్తామన్నారు. గూడూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



విద్యార్థిని మృతిపై ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ, వీఆర్వో

డక్కిలి: డక్కిలి గురుకుల పాఠశాల విద్యార్థిని సరీనా డెంగీ జ్వరం బారిన పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. పాఠశాల సిబ్బంది, ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం వల్లే బాలిక మృతిచెందిందని, వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్, పలువురు ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దీనిపై వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు వాసు దేవర్, నెల్లూరు జిల్లా ఎంఎస్‌పీ అధ్యక్షులు పందేటి అంబేడ్కర్, నెల్లూరు జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఉదయ్‌కృష్ణ, వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి మంగళపూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాలి..

విద్యార్థిని సరీనా మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం సునీల్, ఏఐఎస్ఎఫ్ నాయకులు వేణు, పెంచలయ్య డిమాండ్ చేశారు. బాలిక మృతికి కారకులైన బాధ్యులను సస్పెండ్ చేయాలన్నారు.

రాష్ట్ర స్థాయిలో ఉద్యమం..

విద్యార్థిని సరీనా కుటుంబ సభ్యులకు న్యాయం జరగకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యునైటెడ్ ఫోరం జాతీయ అధ్యక్షుడు వేగూరు విజయ్‌కుమార్, ఏడీపీఎస్ నాయకులు గుండవోలు మధు, రాష్ట్ర దళితసేన నాయకులు మునిరత్నం, కుంచం ప్రసాద్, మస్తాన్ తెలిపారు.

గురుకుల పాఠశాలలో విచారణ

డక్కిలి అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో చదువుతున్న ఐదో తరగతి విద్యార్థిని సరీనా మృతిపై ఈవోపీఆర్డీ అల్లాబక్షు, వీఆర్వో నాగేంద్ర, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, హెల్త్ సిబ్బంది విచారణ చేపట్టారు. ప్రిన్సిపాల్ శ్రీదేవితో చర్చించారు. అనంతరం శానిటేషన్ పనులు చేపట్టారు.


పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక కార్యక్రమం

చిల్లకూరు : వర్షాలు కురుస్తుండడంతో గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు పంచాయతీల కార్యదర్శులు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా శనివారం ఉడతావారిపాళెం గ్రామ పంచాయతీలో వైద్య, సచివాలయ సిబ్బంది కలిసి పంచాయతీ సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేయించారు. అనంతరం బ్లీచింగ్ చల్లించారు. మురుగు కాలువల్లో చెత్తాచెదారం తొలగించి మందు పిచికారీ చేయించారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలని గ్రామస్తులకు సూచించారు. రోడ్లపైకి మురుగు నీటిని వదిలే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్‌నాయుడు, ఏఎన్ఎం వరలక్ష్మీ, ఆశావర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు

చిల్లకూరు : ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ చేయడానికి బృందాలు మండలానికి వచ్చినట్టు ఏపీవో గిరిబాబు తెలిపారు. మండలంలోని 30 పంచాయతీల్లో 2023 ఏప్రిల్ నుంచి 2024 ఏప్రిల్ వరకు ఉపాధి హామీ కింద చేసిన పనులను పరిశీలిస్తారని తెలిపారు. వారి పరిశీలనలో తేలిన విషయాలను ప్రజా వేదికలో తెలియజేస్తారని పేర్కొన్నారు. ఈ ఏడాది ఉపాధి బడ్జెట్‌లో రూ.16,56,33,751 ఖర్చు చేశామని, అందులో కూలీలకు రూ.14,96,3562లు వేతనంగా అందజేసినట్టు పేర్కొన్నారు. మిగిలిన నగదు మెటీరియల్ కింద ఖర్చు చేసినట్టు వివరించారు. రెండు రోజుల తర్వాత కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించి అనంతరం గ్రామాల్లో పనుల పరిశీలనకు ఆడిట్ బృందాల సభ్యులు వెళతారని తెలిపారు.

విమానాశ్రయ పెండింగ్ సమస్యల పరిష్కారం



రేణిగుంట విమానాశ్రయంలో అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

రేణిగుంట: తిరుపతి విమానాశ్రయానికి సంబంధించి ప్రభుత్వపరంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ అన్నారు. రేణిగుంట విమానాశ్రయంలోని వీఐపీ లాంజ్‌లో శనివారం సాయంత్రం ఎయిర్‌పోర్ట్‌కు సంబంధించిన పలు అంశాలపై ఆయన జిల్లా జేసీ ధ్యానచంద్రతో కలిసి సమీక్షించారు. పలు అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. విమానాశ్రయానికి కేటాయించిన పెండింగ్ భూసంబంధిత అంశాలపై, ఎలక్ట్రిక్ లైన్ వంటి పెండింగ్ అంశాలపై ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ట్రాన్స్‌కో అధికారులతో సమీక్షించి, పరిష్కార దిశగా పలు సూచనలు చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, శ్రీకాళహస్తి ఆర్డీఓ రవి శంకర్ రెడ్డి, కేఈఐ సంస్థ ప్రతినిధులు, జి సెక్షన్ సూపరింటెండెంట్ భాస్కర్, ఎయిర్‌పోర్ట్ సివిల్, ఆపరేషనల్ అధికారులు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన మహేంద్రరెడ్డి



సైదాపురం : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని శనివారం తాడేపల్లిలోని కార్యాలయంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరి ఊటుకూరి మహేంద్రరెడ్డి, గూడూరు వైస్ ఎంపీపీ శ్రీనివాసులురెడ్డి, పలువురు నాయకులు కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించినట్టు మహేంద్రరెడ్డి తెలిపారు. కార్యకర్తలకు అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారని పేర్కొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు తగదు

కోట: మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లను టీడీపీ నాయకులు కక్ష పూరితంగా తొలగించడం తగదని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పనబాక కోటేశ్వరరావు తెలిపారు. ఆయన శనివారం కోటలో విలేకరులతో మాట్లాడారు. ఉపాధి హామీ పథకం అమలులో ఫీల్డ్ అసిస్టెంట్లు క్రియాశీలకంగా పని చేస్తారని తెలిపారు. కొన్నిచోట్ల టీడీపీ నాయకులు తమ మద్దతుదారులను నియమించుకోవాలనే ఉద్దేశంతో ప్రస్తుతం పనిచేస్తున్న వారిని తొలగించాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి పరిస్థితి గతంలో ఎన్నడూ లేదన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు చిరు ఉద్యోగులన్నారు. వారిపై ప్రతాపం చూపిస్తే రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందన్నారు. ఉపాధి హామీ పథకం అనేది పూర్తిగా కేంద్రం ఆధీనంలో నడిచేదన్నారు. దీనిపై టీడీపీ నాయకులు పెత్తనం చేస్తూ రాజకీయంగా వాడుకోవడాన్ని బీజేపీ ఖండిస్తోందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని బీజేపీ పెద్దల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపునకు సంబంధించి ఎస్ఆర్ఈజీఎస్ ఏపీవో పూర్ణిమను వివరణ కోరగా మండలంలో ఏడుగురిని తొలగించేందుకు ప్రపోజల్స్ పెట్టినట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



ప్రజలతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

సైదాపురం : డయేరియా, డెంగీ, మలేరియా తదితర సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య తెలిపారు. మండలంలోని తోకలపూడి గ్రామంలో రెండు రోజుల నుంచి డయేరియా కేసులు ప్రబలుతున్నాయి. ఈ క్రమంలో ఆయన శనివారం ఆ గ్రామంలో పర్యటించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కాలువల్లో ఎప్పటికప్పుడు చెత్తాచెదారం తొలగించాలని సూచించారు. అనంతరం వైద్యశాలను పరిశీలించారు. వైద్యులు జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీర్ల పండుగ



అన్నదానం చేస్తున్న దాతలు



పీర్ల వద్ద ప్రార్థనలు చేస్తున్న నాయకులు

నాయుడుపేట టౌన్ : మొహరంను పురస్కరించుకుని పట్టణంలోని గరిడీ వీధిలో ఉన్న హజరత్ మౌలాలి తాలీమ్ ఖానాలో శనివారం పీర్ల పండుగను ఘనంగా జరుపుకున్నారు. పీర్లకు ముస్లింలతో పాటు హిందువులు ఫాతేహాలు చేపట్టారు. పలువురు మొక్కులు చెల్లించారు. శనివారం మధ్యాహ్నం షేక్ అబ్దుల్ ఖాదర్ కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో తంబిరెడ్డి వినోద్ రెడ్డి, కనమర్లపూడి సుబ్రమణి, కే సురేంద్ర, షేక్ మసీద్, పఠాన్ అమీర్‌ఖాన్, మౌలాలీ తాలీంఖానా యువజన కమిటీ అధ్యక్షుడు పఠాన్ ఆరాఫత్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి హత్య కేసులో ముమ్మర దర్యాప్తు





విద్యార్థి మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి (ఫైల్), (ఇన్‌సెట్) భావేష్ (ఫైల్)

నాయుడుపేట టౌన్ : విన్నమాల సమీపంలో 10వ తరగతి విద్యార్థి భావేష్‌ను ఏప్రిల్ 6న హత్య చేసి రాళ్ల గుట్టల మధ్య పడేసిన కేసులో పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. కొంతమంది అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిసింది. ఈ కేసును నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సారధ్యంలో అర్బన్ సీఐ శ్రీనివాసరెడ్డి ఐడీ పార్టీ పోలీసులతో కలిసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. కొంత మేరకు సమాచారం సేకరించినట్టు సమాచారం. నిందితులను పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసినట్టు తెలిసింది.

అనుమానితుడిపై పోలీసుల లాఠీ

పెళ్లకూరు: మహిళ మెడలోని బంగారు సరుడు చోరీ చేశాడని పేర్కొంటూ పోలీసులు ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేయకపోవడంపై స్థానికంగా తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. చింతపూడికి చెందిన తెల్లగూటి గంగమ్మకు మతిస్థిమితం లేదు. పూర్తిగా మంచానికే పరిమితమైంది. మాట్లాడలేదు. ఆమె గత నెల 9న ఇంటి వరండాలో నిద్రిస్తుండగా మెడలోని నాలుగు సవర్ల బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధితురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గ్రామానికి చెందిన పలువురిని, మరికొంతమంది ఫొటోలను గంగమ్మకు చూపించారు. ఆమె అదే గ్రామంలోని దళిత కాలనీకి చెందిన శ్రీనివాసులు ఫొటో చూసి సైగ చేసినట్టు కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ శ్రీకాంత్ అనుమానితుడిని అదుపులోకి తీసుకుని వారం రోజులుగా నాయుడుపేట సర్కిల్ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లు తిప్పుతూ విచారణ చేపట్టారు. పోలీస్ దెబ్బలు తాళలేని శ్రీనివాసులు చోరీ చేసినట్టు ఒప్పుకున్నట్టు సమాచారం. అతనిపై కేసు నమోదు చేయకుండా వారం రోజులుగా పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడం, చితకబాదడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఈ విషయమై నాయుడుపేట సీఐ జగన్‌మోహన్‌రావును వివరణ కోరగా చోరీ చేసినట్టు ఒప్పుకున్న శ్రీనివాసులు బంగారు సరుడు ఎక్కడ ఉందో చెప్పడం లేదని, రికవరీ చేసే విషయంలో శ్రీనివాసులును సీసీఎస్‌కి అప్పగించేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

బామ్‌సేఫ్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



నాయుడుపేట టౌన్ : బామ్‌సేఫ్ (బ్యాక్‌వర్డ్, మైనారిటీ కమ్యూనిటీ ఎంప్లాయీస్ అసోసియేషన్) తిరుపతి జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఆ సంఘ జిల్లా ఇన్‌చార్జి వరప్రసాదరావు తెలిపారు. నాయుడుపేటలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం ఆ సంఘం ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బామ్‌సేఫ్ జిల్లా అధ్యక్షుడిగా కాటూరు చంద్రయ్య, ఉపాధ్యక్షులుగా కడూరు భాస్కర్, దారా బలరామ్, ప్రధాన కార్యదర్శిగా పేర్నాటి భాస్కర్ ఎన్నికైనట్టు తెలిపారు. కార్యక్రమంలో పరిశీలకులుగా ఎస్ఈసీ సభ్యులు ఎ.మురళీకృష్ణ, డి.కృష్ణయ్య, టి.రమేష్, డీఎల్‌డీవో టి.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.